క్లుప్తంగా

న్యాయవాదులు విధుల బహిష్కరణ



సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నూతన చట్టాలను నిరసిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాటిబండ్ల రవి ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, జె.విజయ్‌కుమార్ మాట్లాడారు. న్యాయవాదులు బత్తిన శ్రీనివాసబాబు, పోతల రవి, బాల కోటయ్య, శేషయ్య, నాగుల, విద్యాసాగర్‌రెడ్డి, హరీష్, లక్ష్మణ్, పూర్ణచంద్రరావు, కిషోర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జైబూన్‌బీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

వారాహిదేవి నవరాత్రులు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గాపీఠంలో వేంచేసిన శ్రీ దుర్గా మాతని వారాహిదేవిగా అలంకరించి శనివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు వారాహి దేవి నవరాత్రులు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక నైవేద్యాలు, మంత్రపుష్పం, హారతులు ఉంటాయని పేర్కొన్నారు. తొమ్మిది రోజులు పాల్గొనే భక్తులకు శ్రీ చక్ర మేరువ (ఒక్కొక్కరికి ఒక్కో టి) ఇచ్చి కుంకుమ పూజలు జరిపించనున్నట్లు తెలిపారు. భక్తులు గమనించి ఉత్సాహంతో వారాహి నవరాత్రులులో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): రోడ్డుపై పడిన చెట్టును గమనించక వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు కొమ్మలను ఢీకొని తీవ్ర గాయాపడిన ఘటన మండలంలోని గోళ్ళపాడు సమీపంలోని సేఫ్ ఫార్మా కంపెనీ వద్ద గురువారం రాత్రి జరిగింది. ఘటనకు సంబందించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సత్తెనపల్లి మండలంలోని గుడిపూడి గ్రామానికి చెందిన నూర్ బాజీవలి నరసరావుపేటలోని లిక్కర్ డిపోలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. గురువారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్ర వాహనం పై ఇంటికి వెళ్తూ.. గోళ్ళపాడు సమీపంలోని సేఫ్ ఫార్మా కంపెనీ ఎదురు రోడ్డుపై వర్షానికి పడిన చెట్టు కొమ్మలను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నూర్ బాజీవలి తలకు తీవ్ర గాయం కావటంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ప్రవేటు వైద్యశాలలో చేర్పించారు.

సీజన్ వ్యాధులపై అవగాహన

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం గ్రామ సచివాలయం–3 పరిధిలో ఏఎన్ఎం స్వప్న, ఎంఎల్‌పీహెచ్ రజనీ, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అదేవిధంగా అతిసార విషయంలో ప్రజల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై స్టాప్ డయేరియా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌పీహెచ్ మాట్లాడుతూ అతిసార బారిన పడకుండా పరిసరాలు పరిశుభ్రత, తాగునీటిపై అవగాహన కల్పించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు, పెద్దలకు వాంతులు, విరోచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అతిసార సమస్యలుంటే వెంటనే పీహెచ్‌సీలో తెలిజేయాలని కోరారు.

లీడర్‌షిప్ క్యాంప్‌కు ఎన్‌సీసీ విద్యార్థిని



నరసరావుపేట రూరల్: ఒరిస్సాలో ఈనెల 6వ తేదీ నుంచి జరుగుతున్న ఆల్ ఇండియా అడ్వాన్స్ లీడర్ షిప్ క్యాంప్‌కు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ పాలంరెడ్డి అనూష ఎంపికైనట్టు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్ శుక్రవారం తెలిపారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, వ్యక్తిగతంగా అభివృద్ధి క్యాడెట్స్‌కు ఆర్మీలో ఉద్యోగ అవకాశాలపై ఈ క్యాంప్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. శిబిరానికి ఎంపికైన అనూషను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

నూతన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలి

సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణకు సీఐటీయూ వినతి



ఆర్డీఓ మురళీకృష్ణకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సత్తెనపల్లి: రవాణా రంగానికి పెను భారంగా మారిన నూతన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని చేయుత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం.హరిపోతురాజు డిమాండ్ చేశారు. నూతన చట్టాలను రద్దు చేయాలని కోరుతూ చేయుత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీకృష్ణ కు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిపోతురాజు మాట్లాడుతూ ఇప్పటికే అనేక భారాలతో సతమతమవుతున్న రవాణా రంగాన్ని కొత్తగా తీసుకొచ్చిన చట్టాలతో అధిక పెనాల్టీలు వేయటమే కాకుండా చిన్న, చిన్న తప్పులకు కూడా భారీ స్థాయిలో శిక్షలు వేయడానికి అనుకూలంగా ఈ నూతన చట్టాలు తీసుకొచ్చారన్నారు. ఆటో స్టాండ్‌లో పార్కింగ్ స్థలం ఆక్రమణ, వాహనదారుల వద్ద వసూలు చేస్తున్న ఆశీలు సమస్యల గురించి సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశారు. 2020 నుంచి మెయిన్ రోడ్డులోని ఆర్ అండ్‌బీ బంగ్లాను అనుకొని ఉన్న ఖాళీ స్థలంలో అప్పటి మున్సిపల్ కమిషనర్, అప్పటి సీఐ అనుమతితో వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నామన్నారు. అయితే కొన్ని నెలలుగా కొలిమి కార్మికులు ఆటో పార్కింగ్ స్థలంలో పాకాలు వేసుకొని వారి వృత్తిని కొనసాగిస్తున్నారని, దీని వల్ల ఆటోల పార్కింగ్‌కు స్థలం సరిపోవటం లేదన్నారు. ఈ సమస్యపై కమిషనర్ షమ్మి స్పందిస్తూ ఆటో పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించుకున్న ప్రాంతాన్ని పరిశీలించవలసిందిగా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారన్నారు. సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ సమయాలలో వాహనదారుల నుంచి రుసుము వసూలు చేయమని తాము చెప్పలేదని, వాహనదారులు ఆశీలు వసూలు చేసే వారికి లోడింగ్, అన్‌లోడింగ్ సమయాల్లో ఎటువంటి రుసుం ఇవ్వొద్దని తెలియజేశార న్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ సహాయ కార్యదర్శి జడ.రాజ్‌కుమార్, యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.రాజేంద్ర, ట్రెజరర్ కె.పోలయ్య, సభ్యులు ఎస్.సైదేశ్వరరావు, బి.వీర్రాజు, టి అశోక్, కె.నాగేశ్వరరావు, ఓర్సు శ్రీను, జి నాగేశ్వరరావు, పల్నాటి వెంకటేశ్వర్లు, టి.వెంకట్రావు పాల్గొన్నారు.

డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించండి

- 25వ వార్డులో పర్యటించిన మున్సిపల్ కమిషనరు రవిచంద్రారెడ్డి
- సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బందికి పలు సూచనలు



స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట: 'అతిసార (డయేరియా) గురించి సచివాలయ పారిశుద్ధ్య సెక్రటరీ, ఆరోగ్య సిబ్బందికి తెలియకపోతే ఎలా.. సమావేశాలు నిర్వహించి కంఠశోష వచ్చేటట్లుగా చెప్పినా మీకు ఆ వ్యాధి గురించి తెలుసుకోకపోవటం బాధాకరం' అని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి వాపోయారు. శుక్రవారం 25వ వార్డు పెద్దచెరువులో పర్యటించి డ్రెయిన్‌లు పరిశీలించారు. డ్రెయిన్‌ల గుండా ఏమైనా తాగునీటి పైపులు వెళుతుంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తాగునీరు కలుషితం కావటం వలనే డయేరియా వస్తుందని చెప్పారు. పురపాలక సంఘం తరపున నీటని శుద్ధిచేసి విడుదల చేస్తున్నా ఎక్కడో ఒకచోట డ్రెయిన్‌ల ద్వారా నీరు కలిసే అవకాశం ఉండవచ్చు అన్నారు. తినే ఆహారం, తాగునీరు వలనే మనుషులకు ఎక్కువగా రోగాలు వస్తుంటాయన్నారు. తాగేనీటిని ప్రతిఒక్కరూ కాచి చల్లార్చి తాగాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, దీనివలన దోమలు వృద్ధి చెందకుండా ఉండి డెంగ్యూ లాంటి రోగాలు రాకుండా ఉంటాయన్నారు. ప్రజలకు బాగా అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ రాజు, క్రాంతికుమార్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో డీఈఓ తనిఖీ



మధ్యాహ్న భోజనం వంటల నాణ్యత పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం 11.30 గంటలకు హాజరైన ఆయన మధ్యాహ్నం 2 గంటల వరకూ పాఠశాలలో పలు అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ముందుగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారో లేదో పరిశీలించారు. స్వయంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజూ మెనూ అందిస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూపై సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. రికార్డులు పరిశీలించారు. విద్య పట్ల ప్రభుత్వం ప్రాధాన్యతను వివరిస్తూ పాఠశాల ప్రగతిని పరిశీలించారు. గత మూడేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో మండలంలో టాపర్లుగా విద్యార్థులు నిలవటంపై హెచ్ఎం, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ప్రైవేటు పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలో చేరిన విద్యార్థికి అడ్మిషన్ అందించారు. ఇప్పటి వరకూ ఆరో తరగతిలో 180 మందికి పైగా విద్యార్థులు చేరినట్లు హెచ్ఎం కృష్ణానాయక్ ఆయన దృష్టికి తెచ్చారు.

● టిప్పర్లతో తిప్పలు!



టిప్పర్లతో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈపూరు మండలం భద్రుపాలెం వద్ద క్వారీ, క్రషర్ల నుంచి కంకర, చిప్స్‌లు, పౌండర్ వంటి వాటిని వినుకొండ, కారంపూడి పరిసర ప్రాంతాల్లోని కాంట్రాక్టర్లకు సరఫరా అవుతాయి. ఈ నేపథ్యంలో వినుకొండ –కారంపూడితో పాటు ఇతర రహదారులపై ఆనుకొని ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలు ఈ టిప్పర్ల వలన ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్ పైన మూసి వేయకపోవడంతో, టార్పాలిన్ పట్ట ఏర్పాటు చేయకపోవడంతో రహదారులపై నడిచే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు తప్పడం లేదని, అధిక లోడుతో పాటు అతివేగంగా టిప్పర్లు నడుస్తున్నాయని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం లోడ్‌తో ఉన్న టిప్పర్లను నడిచేలా చూడాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. –బొల్లాపల్లి

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సరోజనీదేవి

మాచర్ల రూరల్ :వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో గ్రామాలలో ప్రబలుతున్న అంటువ్యాధుల నివారణకు తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ సరోజనీదేవి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో శానిటేషన్ పనులు చేపట్టాలని, ముఖ్యంగా మురికి కాలువలలో పూడికతీయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి నిర్దేశించిన ప్రదేశాలల్లో వేసేలా చూడాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బ్లీచింగ్, దోమల నివారణకు మందును చల్లించాలని ఆదేశించారు. ప్రతి కార్యదర్శి విధిగా వారికి కేటాయించిన గ్రామంలో రోజూ పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బిట్టు వెంకటేశ్వర్లు, ఎల్లబోయిన కోటేశ్వరరావు, పాలవాయి వెంకట్రామయ్య, టీపీ సత్యనారాయణ, బాబులాల్ నాయక్, విజయ్ పాల్గొన్నారు.

పింఛను మంజూరు చేయించాలి



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల గుమ్మడి వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులలో ముగ్గురికి పింఛన్ మంజూరు చేయించాలని వినుకొండ తహసీల్దార్‌కు ఆశ్రమం నిర్వాహకులు గుమ్మడి వెంకటేశ్వరరావు తెలిపారు. పూర్తిగా చూపులేని ఇద్దరు, ఒక వికలాంగుడు ఉన్నారని, పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకొని సహాయం చేయాలని కోరారు.

కోర్టు ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరం

56 మంది న్యాయవాదులు, గుమస్తాలకు పరీక్షలు చేసిన వైద్య సిబ్బంది



నరసరావుపేట: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ప్రాంగణంలో కొనాక్ డయాగ్నస్టిక్ సెంటర్ వారి సౌజన్యంతో ఉచిత డయాబెటిస్, ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేదర మెట్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు అమూల్య, కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు పర్యవేక్షణలో 56 మంది న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బందికి మధుమేహం, రక్త పోటు, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో మలేరియా మాసోత్సవాలు



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల సచివాలయాల్లో శుక్రవారం మలేరియా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దోమల నివారణపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ''దోమ పుట్టగూడదు – కుట్టగూడదు'' అనే నినాదాలు చేశారు. దోమతెరలు వాడాలన్నారు. అలాగే మలేరియా నివారణపై కూడా అవగాహన కలిగించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు.

ఆర్యవైశ్య మహిళా దక్షిణాంధ్ర కో-ఆర్డినేటర్‌గా సుజాత



నరసరావుపేట: రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా దక్షిణాంధ్ర కో–ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు యక్కలి సుజాత నియమితులయ్యారు. శుక్రవారం ఆమె తన నియామకం గురించి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావూరి రజని ఆధ్వర్యంలో గత నెల 30న విజయవాడలో రాష్ట్ర కార్యవర్గం మొత్తం ప్రమాణస్వీకారం చేయటం జరిగిందన్నారు. తాను కూడా తన పదవిని స్వీకరించి ప్రమాణస్వీకారం చేశానన్నారు. గత 25 ఏళ్ల నుంచి ఆర్యవైశ్య మహిళా మండలికి ఎన్నో సేవలు చేశానని తెలిపారు.

పర్సన్ ఇన్‌చార్జిగా వెంకటేశ్వర్లు

బొల్లాపల్లి : బొల్లాపల్లి పీఏసీ పర్సన్ ఇన్‌చార్జిగా వెంకటేశ్వర్లు వ్యవహరించనున్నారు. ఆయన సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఇందులో భాగంగా పీఏసీ పర్సన్ ఇన్‌చార్జిగా ప్రత్యేకంగా వ్యవహరించనున్నట్లు ఈ మేరకు బొల్లాపల్లి పీఏసీఎస్ సీఈవో జిర్రా చినకోటేశ్వరరావు తెలిపారు. గత పాలక మండలి అధ్యక్షులు డి. గోవిందు నాయక్, డైరెక్టర్ జి.కొండారెడ్డి, కోటేశ్వరరావులు రాజీనామా చేశారు. పర్సన్ ఇన్‌చార్జిగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

పురుగు మందులు తయారీ కంపెనీల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నాదెండ్ల: మండలంలోని పలు ఎరువులు, పురుగు తయారీ కంపెనీలను వ్యవసాయశాఖ రాష్ట్రస్థాయి అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీలు చేసింది. వ్యవసాయ కమిషన్ కార్యాలయ డీడీఏ సీహెచ్ శ్రీనివాసరావు, ఎం రామచంద్రయ్య, ఎస్ఐ ఒక బృందంగా, అలాగే విజయవాడ ఏడీఏ బి.వెంకటేశ్వరరావు, డీడీ రవికుమార్, విశాఖపట్నం విజిలెన్స్ ఎస్ఐ రెండో బృందంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సాతులూరు గ్రామంలోని పురుగు మందులు తయారీ కంపెనీ ముద్ర ఆగ్రో కెమికల్స్‌లో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా లేనందున రూ. 3,54.142 విలువైన 11 రకాల పురుగు మందులను అమ్మకాలు కాకుండా నిలుపుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. నమూనాలను సేకరించాలని నాదెండ్ల ఏవోను ఆదేశించారు.

దోమల ద్వారానే వ్యాధులు వ్యాప్తి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అచ్చంపేట: దోమల ద్వారానే అన్ని రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని హెల్త్ విజిటర్ వి.బేబీరాణి అన్నారు. డయేరియా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వేల్పూరులో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దయారియా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీ సబ్ సెంటర్స్‌కు వెళ్లాలని సూచించారు. ప్రతి సబ్ సెంటర్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జింకు టాబ్లెట్స్, ఓఆర్ఎస్ ద్రావణం తాగడం ద్వారా నీళ్ల విరేచనాలను అరికట్టవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు లేకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ వర్కర్స్ వద్ద కూడా జింక్ టాబ్లెట్స్, ఓఆర్ఎస్ పాకెట్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకటరావు, సీహెచ్ఓ కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరు ఉద్యోగులపై అధికార పార్టీ వేధింపులు ఆపాలి

అమరావతి: అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో స్కీం వర్కర్స్‌పై వేధింపులు ఆపాలని సీఐటీయూ మండల కమిటీ కార్యదర్శి బి.సూరిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్నం భోజనం పథకం, పంచాయతీ కార్మికులను అధికార టీడీపీ నాయకులు బెదిరించటం దారుణమన్నారు. అధికారం వచ్చిందని తమకు సంబంధించిన వారిని నియమించుకోవడానికి..ప్రస్తుతం పని చేస్తున్న వారిని తప్పుకోవాలని బెదిరిస్తూ, మానసికంగా వేధిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు పద్ధతి మార్చుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో బెదిరింపులకు గురైన అనేక మంది ఉద్యోగులు మానసికంగా కృంగిపోయి, అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో గుండె సంబంధిత వ్యాధులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం వస్తే తమ కోరికలు నెరవేరుతాయని, తమ హక్కులు కాపాడతారనుకుంటే..అందుకు విరుద్ధంగా చిన్న ఉద్యోగులపై అధికార పార్టీ నాయకులు ప్రతాపాన్ని చూపడం సరికాదని హితవు పలికారు. ఇప్పటికైన టీడీపీ అగ్ర నాయత్వం కల్పించుకుని బెదిరింపులను ఆపాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజుపాలెం: పిల్లల్లో వాంతులు, విరోచనాలు ఉన్నట్లయితే.. వెంటనే వారికి జింక్ మాత్రలతో పాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాని హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లో కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోరాదని స్పష్టం చేశారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వేడి పదార్థాలనే తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రవికుమార్, ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశ కార్యకర్త ప్రసన్న పాల్గొన్నారు.

● ఆదమరిస్తే.. ఆస్పత్రికే...!



మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉన్న కల్వర్టుపై ఏర్పడిన రంధ్రం అందర్నీ కలవరపెడుతోంది. ఆదమరచి వాహనం నడిపితే నలుగురు మోసుకుని ఆస్పత్రికి తీసుకుపోవాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొని ఉంది. నిత్యం వివిధ రకాల పనులపై తహసీల్దారు కార్యాలయానికి వస్తున్న ప్రజానీకం కల్వర్టుపై ఏర్పడిన రంధ్రాన్ని జడుసుకుంటున్నారు. గతంలో ఇదే ఏరియాలో రంధ్రం ఏర్పడటంతో ప్రజాప్రతినిధులు స్పందించి రంధ్రానికి మరమ్మతులు చేయించారు. సత్వరమే అధికారులు స్పందించి కల్వర్టుపై ఏర్పడిన రంధ్రానికి మరమ్మతులు చేయించి ప్రమాదం నుంచి వాహనదారులను రక్షించాలని కోరుతున్నారు. –శావల్యాపురం

ఉన్నత శిఖరాలకు చేతిరాతే నిచ్చెన



క్యాలీగ్రఫీ శిక్షణ అనంతరం డైట్ అధ్యాపకులు, శిక్షకులు

- డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ సలీంబాష
- జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాలలో కాలీగ్రఫీ శిక్షణ

యడ్లపాడు: ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు విద్యతో పాటు చక్కని చేతిరాత ఎంతగానో దోహదపడుతుందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ సలీంబాష చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో క్యాలీగ్రఫీ శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. క్యాలీగ్రఫీ శిక్షకులు రామమోహన్‌రావుతో పాటు రీసోర్సుపర్సన్లు తోరటి శ్రీనివాసరావు, ఎ అనిల్‌కుమార్, కెఎస్ఎస్ ప్రసాద్, సత్యనారాయణ, నాగలక్ష్మీ, శారద, రమాదేవి పాల్గొని కళాశాలలోని 75 మంది డీఎడ్ కోర్సు అభ్యసించే విద్యార్థులకు, అలాగే డైట్ కళాశాల అధ్యాపకులకు చేతిరాతపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేతిరాత విద్యార్థుల మానసిక పరిస్థితిని మార్చుతుందని, అలాగే విద్యాభివృద్ధి, ఉజ్వల భవిష్యత్‌కు సోపానం అవుతుందన్నారు. కళాశాల లెక్చరల్ ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినా చేతిరాతకు ఉన్న ప్రాధాన్యత ఎన్నటికీ తగ్గదన్నారు. క్యాలీగ్రఫీ శిక్షకులు రామమోహన్‌రావు మాట్లాడుతూ క్యాలీగ్రఫీ శిక్షణ ఉద్యమంలో భాగంగా ఇప్పటి వరకు 35వేల మంది విద్యార్థులు, 3600 మంది ఉపాధ్యాయుల చేతిరాతను మార్చడం జరిగిందన్నారు. అనంతరం క్యాలీగ్రఫీ శిక్షణ ఇచ్చిన వారిని అభినందించారు.